స్నేహితులిద్దరూ రోడ్డుమీద నడుస్తూ మాట్లాడు కుంటున్నారు.

"మనిషిలో ఎప్పుడూ దేవుడుంటాడు. కాని కష్టంలో ఉన్నప్పుడే గుర్తుకు తెచ్చుకుంటాడు. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే నిత్యం దైవస్మరణ చేసుకుంటూ ఉండాలి"

# దేవుడున్నాడు!

"ముప్ఫయ్యేళ్ళకే ఇంత వైరాగ్యమేమిట్రా నీకు?" నారాయణ మాటల్ని చప్పరించేసాడు శ్రీధర్.

"వైరాగ్యం కాదు ఇది ధర్మం. దేవుడు మానవ జీవితానికెన్నో ఉపకారాలు చేసాడు. మంచి రుచులు ఆస్వాదించటానికి నాలుకనిచ్చాడు. సృష్టిలోని సౌందర్యాన్ని చూడటానికి కళ్ళిచ్చాడు. మధుర సంగీతాన్ని వినటానికి చెవులిచ్చాడు. ఆలోచించటానికి మేధస్సునిచ్చాడు. అడగకముందే ఇన్ని వరాలిచ్చిన ఆ దేవుడి దయకి కృతజ్ఞతగా రోజూ కాసేపు స్మరించుకోవటం మన ధర్మం కాదా?"

శ్రీధర్‌కి జవాబివ్వటానికి మాటలు దొరకలేదు.

"దారిలో నడిచిపోయే వేళ కూడా మరే పనీ లేకపోతే దైవాన్ని స్మరిస్తూ ఉండు. నిత్యం ఒక్క క్షణం నిర్మల హృదయంతో భక్తిశ్రద్ధలతో ధ్యానం చెయ్యి. మనసులో నమస్కారం చెయ్యి. తప్పకుండా ఫలితం ఉంటుంది!"

"ఈ ప్రాక్టికల్ ప్రపంచంలో మరీ ఇంత చాదస్తం పనికిరాదు"


"ఇది చాదస్తం కాదు నిత్య జీవితంలో ఏ తప్పూ చేయకుండా మనల్ని మనం కొరడాతో ఝుళిపించుకోవటానికి"

"మనమేం తప్పు చేస్తున్నామని?"

"తప్పు చేస్తున్నవాడికి ఏదీ తప్పనిపించదు. కానీ తెల్లవారి లేచింది మొదలు..నువ్వు వంద తప్పులు చేయటానికి పరిస్థితులు సిద్ధం. కాఫీలో పంచదార వేయలేదని మీ ఆవిడ్ని తిడతావు. పోనీ, పొరపాటున మర్చిపోయిందేమోనని సరిపెట్టుకోవు. పిల్లాడు స్కూలు టైముకి తయారు కాలేదని వాడిమీద విసుక్కుంటావు. క్రితం రాత్రే హోమ్ వర్క్ చేసుకున్నాడో లేదో అడిగి అప్పుడే బేగ్ సర్దుకున్నాడో లేదో అని అడగవు. అన్నీ మీ ఆవిడే చూసుకోవాలని అనుకుంటావు. పోనీ అని ఆమెకు ప్రొద్దున్న సాయం చెయ్యవు. ఇచ్చిన మాట ప్రకారం ప్లాటు కొనటానికి సుందరం దగ్గర చేసిన అప్పు తీర్చవు. ఇబ్బందుల్లో ఉండి కాంతారావు అప్పు అడిగితే జేబులో డబ్బుండి కూడా లేదంటావు"

"మరీ నన్నింత దుర్మార్గుడిలా చిత్రించకు. ఆవేళ మా ఆవిడకి పుట్టిన రోజు కానుకగా చీరకొందామనుకున్నా! అందుకే లేదనాల్సి వచ్చింది"

"వాడి కూతురికి ఆక్సిడెంటయి ఆపదలో ఉందని తెల్సినా నువ్వలా అనగలిగావంటే నువ్వు చేసేది ఏదీ నీకు



తప్పనిపించదు. పుట్టిన రోజు పండగలు మళ్ళీ మళ్ళీ వస్తాయి. పోయే ప్రాణాలు మళ్ళీ తిరిగి వస్తాయా? అలా ఆ పిల్లని ఆదుకోవటానికి డబ్బు ఖర్చుపెట్టానని నువ్వంటే మీ ఆవిడ మాత్రం తప్పుపడుతుందా?"

శ్రీధర్ దగ్గర జవాబు లేకపోయింది.

"అదృష్టవశాత్తూ కాంతారావు కూతురికి నయమైంది. లేకపోతే నిన్ను నువ్వెప్పుడైనా క్షమించుకోగలవా? మామూలు రొటీన్ విషయాలే తీసుకో! ఆఫీసు టైముకి చేరాలని అనుకోవు. చేరవు. బాస్ అడక్కుండా ఏ పనీ ముట్టుకోవు. ఎవరేనా చేతిలో పెడుతుంటే వద్దనవు"

"మనం మడికట్టుకుంటే సరిపోతుందా? నిన్ను చూసినట్టే నన్నూ వెలివేస్తారు"

"మన డ్యూటీ మనం చేసినందుకు మనకి జీతమిస్తున్నారు. అక్రమ సంపాదన అవసరం మనకి లేదు. కష్టపడి సంపాదించిన దాంట్లో ఉన్న సుఖం అడ్డదారులు తొక్కినదాంట్లో దొరకదు"

"అబ్బ..నీ సణుగుడు ఆపరా నాయనా!"

"నీకు అలాగే అనిపిస్తుంది. కాని అనేకమంది తప్పులు చేస్తున్నారు. కనుక నేనూ చేస్తున్నానని జీవితంలో రాజీ పడిపోవటంకన్నా నీకంటూ ఓ మంచి పద్ధతి ఏర్పరచుకోవాలని నీకెందుకనిపించదు? పోనీ నీకేమన్నా డబ్బు సమస్యలున్నాయా? మరి నువ్వెందుకు అవినీతి పనులకి లొంగినట్టు?"

"నేనెంత చెప్పినా నీకర్థం కాదేం? డబ్బిస్తేనే చేస్తానని నేనెవర్నీ ఇబ్బంది పెట్టటం లేదు. పని చేసినందుకు ఆ పార్టీ సంతోషంగా ఇస్తుంటే"

"సమయానికి పనిచేసి ఆ మనిషి ముఖం ఇంకా ఎక్కువ ఆనందంగా ఉండటం ఎప్పుడేనా చూసావా నువ్వు?"

"ఇంకే టాపిక్కు వదిలేసి నన్ను రక్షించు నాయనా!" అన్నాడు శ్రీధర్ విసుగ్గా.

రోడ్డు మీదకి అడ్డంగా నడిచి అక్కడ పడివున్న ఇటిక బొంతని చటుక్కున చేతబట్టుకున్నాడు నారాయణ. సరిగ్గా అదే సమయంలో ఒక కారు రయ్‌మంటూ అటు వచ్చింది. శ్రీధర్ కనుక గబుక్కున నారాయణ చెయ్యి పట్టుకొని పక్కకిలాగక పోయివుంటే అతను తప్పకుండా కారు క్రింద పడిపోయుండేవాడు.

"ఏమిట్రా ఈ పని? ఎందుకీ ఈ యిటిక బొంత?" అడిగాడు శ్రీధర్.

"కారుకనే, లారీకనే రిపేరు కోసం వాడుకొని నిర్లక్ష్యంగా ఎవరో దీన్ని రోడ్డుమీద పడేసి వెళ్ళిపోయారు. ఏ స్కూటరయినా ఇటు వచ్చినప్పుడు దానికి తగిలి పడిపోతే ఎంత ప్రమాదం? అందుకనే..దీన్ని తీసి పక్కన పడవేద్దామని"

"గొప్పవాడివే! ఇప్పుడు నువ్వే కారు క్రింద పడబోయావు"

నారాయణ ముఖంలోని చిరునవ్వు చెక్కు చెదరలేదు. "ఎవరికేనా ప్రమాదం కలుగుతుందేమోనని నేనా పని చేసాను. నాకపకారం కలక్కుండా చూడాల్సిన బాధ్యత దేవుడిదే! ఆయనే నా పక్కన గార్డియన్‌లా ఉండి చూసుకుంటూ ఉంటాడు!"

"భలేవాడివే! నిన్ను రక్షించింది దేవుడు కాదు నేను!"

"నన్ను రక్షించింది నువ్వు కాదు నీలోని దేవుడు!"

"నాలోని దేవుడా?"

"అవును. నువ్వు గుర్తించలేకపోతున్న నీలోని దేవుడు. నీ వెంట వచ్చే మంచిలాగా నీ దేవుడు నీలోనే కాదు నీ పక్కగా ఉంటాడు. నాచేత ఈ యిటుకని తీయించి రాబోయే ప్రమాదాన్ని తప్పించిన భగవంతుడే నన్ను కాపాడే బాధ్యత నీ చేతుల్లో పెట్టాడు. సహజంగా నీలో మంచితనం ఉంది కనుకనే అప్రయత్నంగా నన్ను పట్టుకొని లాగగలిగావు. లేకపోతే జరిగే ఘోరాల్ని చూసే అనేకమంది ప్రేక్షకుల్లో నువ్వూ ఒకడివి అయివుండేవాడివి!"

ఏదో అద్భుతశక్తి తనలో మేల్కొన్నట్టు శ్రీధర్‌కి ఒళ్ళు పులకరించింది.

**-తటవర్తి రామచంద్రరావు**
(న్యూఢిల్లీ)

# నారాయణుడు

వైకుంఠం!

పాలసముద్రం మీద శేషపాన్పుపై పవళించి ఉన్నాడు విష్ణుమూర్తి. లోకపాలనకు ప్రతీకలాగా ఆయన పెదవులపై చిరు మందహాసం నిలిచివుంది. శ్రీమహాలక్ష్మి ఆయన పాదసేవలో లీనమై వుంది. సాక్షాత్తూ ఆ శ్రీనివాసుణ్ణే తనలో నిలుపుకోగలిగినందుకా అన్నట్లు క్షీరసాగరం కించిత్ గర్వంతో గంభీరంగా ఉంది. ఆ జగత్పరిపాలకుని దివ్యనామాన్ని స్మరిస్తూ, ద్వారపాలకులు తమ విధిని నిర్వర్తిస్తున్నారు.

ఇంతలో భూలోకం నుంచి 'శ్రీనారాయణాయ నమః' అని వినిపించింది.

* * *

రాజారాం వయసు ఇరవై ఏడు సంవత్సరాలు. ఇంకా అతనికి ఉద్యోగం రాలేదు. ఆ ప్రయత్నాల్లోనే ఉన్నాడు. గవర్నమెంట్ ఉద్యోగానికి వయసు మీరిపోతుండటంతో కంగారుగా ఉంది. చాలా పరీక్షలు రాశాడు. కానీ ఇంతవరకూ ఎందులోనూ సెలక్షన్ మాత్రం రాలేదు. ఇంటా బయటా అప్పుడే వ్యంగ్య వ్యాఖ్యలు మొదలయ్యాయి. "ఏం చేస్తున్నావు?" అని ఎవరైనా అడిగితే, "ఖాళీగానే ఉన్నాను" అని చెప్పాల్సి వస్తోంది. ఆ ఇబ్బంది అనుభవిస్తేనేగానీ తెలియదు. "పోనీ, ఏ హైదరాబాదో వెళ్లి ఏదైనా కంపెనీలో చేరొచ్చుగా" లాంటి సలహాలు కూడా వినబడుతున్నాయి. "ఆడపిల్లలే ఖాళీగా కూర్చోవటం లేదు గదయ్యా" అని బాబాయ్ వరస వాళ్లు వేళాకోళం చేస్తున్నారు. వీటన్నింటి మధ్యా అతనికి ఫ్రస్ట్రేషన్ మొదలవుతోంది.


అయితే అతను దైవభక్తుడు. ప్రతి పరీక్షముందూ క్రమం తప్పకుండా గుడికి వెడతాడు. ఏవేవో మ్రొక్కులు మ్రొక్కుతాడు. ప్రదక్షిణలు చేస్తాడు. కొబ్బరికాయలు కొడతాడు. కానీ ఇంకా దేవుడు కరుణించలేదు. మళ్లీ రెండు రోజుల్లో పరీక్ష వుంది. అదే ఆఖరిది!

దాంతో విపరీతమైన టెన్షన్‌తో ఉన్నాడు రాజారాం. ఇదిగానీ ఫెయిలైతే ఇక బ్రతుకే శూన్యం అనిపిస్తోందతనికి. అందుకే కన్పడిన దేవుడికల్లా దణ్ణం పెడుతున్నాడు. ఇక పరీక్షకి బయలుదేరేముందు విష్ణుసహస్రనామం చదువుకున్నాడు.

ఆ ప్రార్థనే వైకుంఠంలోని శ్రీమహావిష్ణువుకి వినిపించింది.

"స్వామీ!" పిలిచింది లక్ష్మీదేవి. 'ఏమిట'న్నట్లు చూశాడు విష్ణువు.

"అతడు మళ్లీ మిమ్ములను ప్రార్థిస్తున్నట్లున్నాడు" అంది జగన్మాత. మౌనంగా తల పంకించాడు దేవదేవుడు.



"మీరేమీ పట్టించుకోరేం స్వామీ?"

శ్రీనివాసుని చిద్విలాసం చెరగలేదు. "ఏ విషయంలో దేవీ?" అన్నాడు శాంతంగా.

"అదేమిటి నాథా అలా అంటారు? ఆ కుర్రవాడు ఎంత బాధపడుతున్నాడో చూశారా? ఒక చిన్న ఉద్యోగం కోసం తపించిపోతున్నాడు. మీకు ఎన్నో మ్రొక్కులు మ్రొక్కుతున్నాడు. ఎంతో ప్రార్థిస్తున్నాడు"

తల ఊపాడు కేశవుడు.

"మరి.." అంటూ ఆగింది హిరణ్మయి.

"నేను మాత్రం ఏం చేయను లోకపావనీ?" అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది శ్రీమాత. "అతనికో ఉద్యోగాన్ని ప్రసాదించవచ్చుగదా నాథా!" అన్నది.

"ఈ విషయంలో నేను అశక్తుణ్ణి."

"అశక్తులా! సకల చరాచర సృష్టికి కారకులు, పాలకులు. భక్తుల కోరికలు తీర్చే కల్పవృక్షం వంటివారు. బ్రహ్మరాతను కూడా మార్చగలిగే సమర్థులు. మిమ్ములనే నమ్మినవారికి తృప్తిని, ముక్తినీ ప్రసాదించే అసమాన దాతలు! ఇటువంటి మీరు అశక్తులా స్వామీ?"

కేవలం చిరునవ్వు మాత్రంతో లోకాన్ని సమర్థవంతంగా పరిపాలించగలిగే ఆ ఆదివిష్ణువు, క్షీర సముద్ర రాజ తనయ అడిగిన ఆ ప్రశ్నకు ఏం సమాధానం చెబుతాడోనని దేవతలందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు.

శ్రీకరుడు మౌనాన్ని విడనాడుతూ చెప్పాడు "లక్ష్మీ! నీవు చెప్పినవన్నీ వాస్తవములే! అయితే భక్తులు మనః పూర్వకముగా కోరుకున్నప్పుడే వారి వారి కోరికలు నాచేత తీర్చబడతాయి. మనస్ఫూర్తిగా ఒక కోరిక కోరుకున్న భక్తులు దానిని తీర్చుకొనేందుకు తాము కూడా తమ వంతు ప్రయత్నం చేస్తారు. నేను చేసేదల్లా ఆ ప్రయత్నం నెరవేరేటట్లు చేయటమే!

నామీద సంపూర్ణ విశ్వాసం ఉంచి ప్రయత్నించే వారి కోరిక నాచేత తప్పక తీర్చబడుతుంది. అసలంటూ ప్రయత్నమే చేయని వారి విషయంలో నేను కూడా కల్పించుకోలేను.

ఆ రాజారాం విషయంలో ఇదే జరుగుతోంది దేవీ! అతని పరిస్థితికి జాలిపడి నేను ఎన్నో అవకాశాలు ఇచ్చాను. కానీ అతను ఉపయోగించుకోవటం లేదు. ఒక్కరోజు కూడా అతను మనసును కేంద్రీకరించి ఏ పరీక్ష కోసమూ చదువలేదు. కేవలం నాకు మ్రొక్కటం ద్వారానూ, ప్రదక్షిణలు చేయటం ద్వారానూ అతనికి ఏ ప్రయోజనమూ సిద్ధించదు. మానవులు తమ ప్రయత్నం తాము చేయవలసిందే! నిజానికి నాకు ఏ మ్రొక్కులూ అవసరం లేదు. వారి వారి పనులను సవ్యంగా చేస్తే నేను ఎంతో సంతోషిస్తాను. వారిని నిత్యం సంరక్షిస్తూ ఉంటాను. అందుకే శ్రీదేవీ, అతని గురించి నేను అలా చెప్పాను" విష్ణుమూర్తి చెప్పటం ముగించాడు.

విశ్వజనని విభుని వంక అపురూపంగా చూసింది. తన హృదయవాసుడు ఎంతటి అల్పసంతోషో, జీవులను ఎంతగా ప్రేమిస్తాడో అర్థం చేసుకున్న ఆమె, తిరిగి ఆయన పాదసేవలో లీనమైంది.

**-మిత్రా**
(నిజామాబాద్)